

# దేవతలను అర్చించే భాగ్యం గల నీలి కలువలు

జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com

(గత సంచిక తరువాయి)

## సరస్వతీ వనం



వేదా వేదాంత సంవేద్యా, వేదాంత జ్ఞాన రూపిణీ ।
విభావరీ చ విక్రాంతా, విశ్వామిత్రా విధిప్రియా ॥

వరిష్ఠా విప్రకృష్టా చ విప్రవర్య ప్రపూజితా ।
వేదరూపా వేదమయీ వేదమూర్తి శ్చ వల్లభా॥

## నీలోత్పల పుష్పార్చన

మన పురాణాల్లో వేర్వేరు సందర్భాల్లో శ్రీ మహావిష్ణువు, శ్రీరామచంద్రుడు నీలోత్పలాలతో శివుణ్ణి, దుర్గాదేవిని అర్చించినట్లు తెలుస్తోంది. ఆ వివరాలను చూద్దాం.

### రావణాసురుని వధ

మనం వాల్మీకి రామాయణాన్ని అనుసరించినట్లు బెంగాలీవారు కృత్తివ రామాయణాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. వాల్మీకి రామాయణంలో శ్రీరాముడు సూర్యుడిని పూజించి, ఆదిత్యహృదయం పఠించి రావణాసురునితో యుద్ధానికి తలపడి విజయాన్ని పొందాడని వుండగా, కృత్తివ రామాయణంలో రామరావణులు ఐదురోజుల యుద్ధానంతరం కూడా ఎటువంటి ఫలితం రాకపోవడం చేత దేవతలు రామునితో దుర్గాదేవిని పూజించమని సెలవిస్తారు. ఎందుచేతనంటే లంకా నగరాన్ని రావణుడు కుబేరుని వద్ద నుంచి తీసుకోకపూర్వం ఆ ప్రాంతమంతా దుర్గాదేవి ఆధీనంలో వున్నట్లు తెలుస్తోంది. అందువల్ల ఆ దేవి అనుగ్రహం కోసం ఆమెను 108 నీలోత్పలాలచే పూజించమంటారు. ఆరవరోజు రాముడికి కేవలం 107 పువ్వులు మాత్రమే లభిస్తాయి. ఇక అత్యవసర పరిస్థితిలో రాజీవనేత్రుడు, పద్మనయనుడైన శ్రీరాముడు తన నేత్రాన్ని 108వ పుష్పానికి బదులుగా సమర్పించడానికి ఉపక్రమించగా, దుర్గాదేవి ప్రత్యక్షమై అతడిని వారించి, “విజయం వరించుగాక!” అని దీవిస్తుంది.

శ్రీరాముడు ఏడవరోజు యుద్ధానికి వెళ్ళి ఎనిమిది, తొమ్మిదవ రోజుల సంధి సమయంలో రావణాసురుడిని సంహరిస్తాడు. పదవరోజు అంత్యసంస్కారాలను పూర్తిగావిస్తాడు. అదే విజయదశమి.





ఈ వృత్తాంతాన్ననుసరించే తూర్పు, ఉత్తర భారతావనిలో దసరా రోజున రావణ, కుంభకర్ణ, మేఘనాథుల దిష్టిబొమ్మలను అగ్నిబాణాలు సంధించి దహనమయ్యేటట్లు చేసి, పండుగ చేసుకొంటారు.





### అకాల్ బోధన్

ఒకప్పుడు బెంగాల్ ప్రాంతంలో దుర్గాదేవిని వసంత ఋతువులో



వంద మంచి మాటలు చెప్పడం కన్నా ఒక్క మంచిపని చేయడం శ్రేయస్కరం.

మాత్రమే పూజించేవారుట. కానీ రాముడు దుర్గమ్మ వారిని శరదృతువులో పూజించటాన్ని 'అకాల్‌బోధన్' అంటే 'అకాలపూజ' అని పిలుస్తారు. రావణవధానంతరమే ఆ ప్రాంతంవారు దసరా సమయంలో అమ్మవారిని విశేషంగా పూజించటం మొదలుపెట్టారు అని చెప్పబడింది.

అప్పట్నుంచి యుద్ధానికి వెళ్ళేముందు రాజులు శ్రీ దుర్గాదేవిని పూజించి వెళ్ళటం అనే పద్ధతి మొదలైంది. దీని ప్రకారమే మహాభారతంలో అర్జునుడు, ధర్మరాజు దుర్గాదేవిని పూజించి ఆమె అనుగ్రహాన్ని పొందినట్లు వుంది. ఆ తదుపరి శివాజీ మహారాజు కూడా యుద్ధానికి వెళ్ళే ప్రతిసారీ దుర్గాభవానికి పూజలు చేసేవాడని, ఒకసారి ఆమె అతడికి అనుగ్రహించిన ఖడ్గంతోనే యుద్ధాలను చేసేవాడని చరిత్ర చెబుతోంది.









ఇక దక్షిణాదికి వస్తే తమిళపురాణాల్లో శ్రీ మహావిష్ణువు ఒకానొక సందర్భంలో శివుడిని నీలోత్పలాలతో పూజిస్తుంటాడు. శివుడు అతడిని పరీక్షించదలచి 108 పుష్పాలలో ఒకదాన్ని దాచేస్తాడు. అంతట ఆ కమల నయనుడు తన నేత్రాన్ని సమర్పించినట్లు వుంది. ఇదే వృత్తాంతంలో నీలోత్పలాలకు బదులు పద్మాలతో విష్ణుమూర్తి పూజించినట్లు వేరొక సందర్భంలో చూడవచ్చు. విష్ణువు చేతిలో వున్న అతడి ఎడమనేత్రాన్ని పై చిత్రాలలో గమనించగలరు.

## నీలోత్పల అంబిక

ప్రతిఏటా తమిళనాడులోని తిరువారూర్‌లో శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు కన్నులపండువగా, వీనులవిందుగా ఎంతో విశేషంగా జరుగుతుంటాయి. కావేరీ నదిఒడ్డున ఈ దివ్యక్షేత్రంలో శ్రీ త్యాగరాజ స్వామి విగ్రహంతో పాటు స్వయంభు శివుడు (వన్మీకనాథుడు), కమలాంబిక, నీలోత్పల అంబిక, హయగ్రీవుడు, తపోముద్రలో వున్న సరస్వతి మొదలగు దేవతలను చూడవచ్చు. అక్కడి కొలను పేరు 'కమలాలయ తీర్థం'.

సంగీత కళానిధి శ్రీ ముత్తుస్వామి దీక్షితార్ నీలోత్పలాంబిక మీద పాడిన కృతి ఎంతో విశేషమైంది.

నీలోత్పలాంబికే నిత్య శుద్ధాత్మికే మామవ త్రిలోక జనని త్రిభువన మోహిని త్రైలోక్య చక్రవాసిని సద్గురు గుహ విశ్వాసిని... (ఛాయాగౌళ రాగం, రూపక తాళం) ఈ మధ్యనే ఇది ప్రాచుర్యంలోకి వచ్చింది.





మన దేశంలోని వివిధ పురాణాలు, ఇతిహాసాలు, గ్రంథాలు, గాథల్లో కలువలు, నీలోత్పలాల వర్ణనలు అనేకం చూడవచ్చు. వీటిలో ఎక్కువ శాతం దేవీ, దేవతల మేనిఛాయ, నేత్రవర్ణనలు, సూర్యచంద్రాదులతో కూడిన వర్ణనలు వంటివి. ఇక ఇప్పుడు ఆ శ్లోకాలను, అవసరమైన చోట తాత్పర్యాలు, అర్థాలను చూద్దాం.

## మహాకవి కాళిదాసు – శ్యామల దండకం

మాణిక్యవీణాం ముపలాల యంతీం
మదాలసాం మంజుల వాగ్విలాసాం.....
.......జయ మాతంగ తనయే జయ నీలోత్పల ద్యుతే
జయ సంగీత..... జయలీల సుఖప్రియే







## సౌందర్యలహరి

సౌందర్యలహరిలో వంద శ్లోకాలున్నాయి. ఒక్కో శ్లోకం ఒక్కో ఫలితాన్ని ఇస్తుంది. ఈక్రింది శ్లోకం నిత్యం పఠించడం వల్ల సకల సౌభాగ్యాలు ప్రతినిత్యం చేకూరగలవు అని ప్రస్తావించబడింది.

**దృశా ద్రాఘీ యస్యా దరదలిత నీలోత్పల రుచా**
**దవీయాంసం దీనం స్నపయ కృపయా మా మపి శివే।**
**అనే నాయం ధన్యో భవతి నచతే హాని రియతా**
**వనేవా హర్మ్యేవా సమకరని పాతో హిమకరః॥** (57)


మనసులో కపటం లేకపోవడమే మంచితనానికి అర్థం.

అర్థం : ఓ శివుని సఖి ఈ దీనునిపై కృప వుంచి అప్పుడే విచ్చుబోతున్న నీలోత్పలాలలోని కాంతి వంటి తేజస్సుతో వున్న నీ దీర్ఘ నేత్రాలతో నన్ను ముంచెత్తు. ఎలాగైతే చంద్రుని చల్లని కాంతివనాలు, ఎత్తైన భవంతుల మీద ఒకేలా ప్రసరించినసూ ఏమీ కోల్పోదో, అలాగే నేను సకల సౌభాగ్యాలనూ పొందుతానే తప్ప నీవేమీ కోల్పోవు.



### దశరథుడు - శని స్తోత్రం

**ధ్యాత్వా సరస్వతీం దేవీం గణనాథం వినాయకం**
**రాజా దశరథః స్తోత్రం సౌరేరిధామాతకరోత్**
**నమో నీల మయూఖాం యా నీలోత్పల నిభాయ చా,**
**నమో నిర్మాంస దేహాయ దీర్ఘ శ్మశ్రు జటాయ చా**

*(శ్రీ పద్మపురాణంలో ప్రస్తావించిన శ్లోకంలో ఇదొక చిన్న భాగం మాత్రమే)*





### భరత కవచం

**మండవి దౌత చరణం రసన నూపురాన్విత**
**నీలోత్పల దళశ్యామం ద్విజ రాజ సమాననం**

అర్థం : నూపురాలు ధరించి మండవి చేత పూజింపబడే పాదాలు.

నీలోత్పల రేకుల మేనుఛాయ కలిగి, రెండుమార్లు జన్మించిన రాజుతో సమానమైన వాడు. ('మాండవి' జనకుని సోదరుడైన కుశ ధ్వజుని కుమార్తె. సీతకు సోదరి, భరతుని భార్య)

### లక్ష్మణ కవచం

**రామప్రుష్ఠం స్థితంరమ్యం రత్న కుండల ధారిణం**
**నీలోత్పల దళ శ్యామం రత్న కనక మండితం**

అర్థం : రాముని వెనుక వుండేవాడు, రమ్యమైనవాడు, రత్నఖచిత కుండలాలు ధరించినవాడు, నీలికలువ ఛాయలో వుండేవాడు, బంగారు రత్న కంకణాలు ధరించినవాడు.

భరత లక్ష్మణులకు కేరళ రాష్ట్రంలో  పలు దేవాలయాలున్నాయి. ఒరిస్సాలోని ఖజురహోలో కూడా లక్ష్మణునికి ఒక దేవాలయముంది.

అంతగా ప్రాచుర్యం పొందని భరత, శతృఘ్నుల దేవాలయాల గురించి క్లుప్తంగా తెలుసుకొందాం.





### నాళంబళ యాత్ర

కేరళ రాష్ట్రంలో 'నాళంబళ యాత్ర' అన్నది ఎంతో విశిష్టత కలిగి వుంది. నాలు అంటే నాలుగు. అంబళం అంటే దేవాలయం అని అర్థం. ఈ నలుగురు సోదరుల దేవాలయాలు దగ్గర దగ్గరగానే అంటే కొన్ని కిలోమీటర్ల దూరంలో వుంటాయి. కార్తికమాసంలో ఎవరైతే ఈ నలుగురు సోదరుల్ని వరుసక్రమంలో దర్శించుకుంటారో వారికి సకల సౌభాగ్యాలు కలిగి, సంతుష్టులై వుంటారని అక్కడి వారి ప్రగాఢ విశ్వాసం.

1) త్రిప్రయార్ శ్రీరామ దేవాలయం
2) ఇరింజలకుడాలోని భరతుని దేవాలయం
3) మూజిక్కుళంలోని లక్ష్మణ పెరుమాళ్ దేవాలయం
4) పయమ్మళ్‌లోని శత్రుఘ్నుని దేవాలయం.

ఈ విధమైన నాలుగేసి దేవాలయాల సమూహాలు మరో మూడు



మితిమీరిన ఆశ వలనే మనసు గతి తప్పుతుంది.





జిల్లాల్లో వున్నాయి. అక్కడివారు కేవలం శ్రీరాముడినే కాకుండా దైవాంశ సంభూతులైన అతడి సోదరుల్ని కూడా ఆరాధించడం హర్షించి, అనుసరించదగ్గ విషయం. లక్ష్మణుడు శ్రీ మహావిష్ణువు యొక్క ఆదిశేషుని అవతారం కాగా, భరత శతృఘ్నులు విష్ణుమూర్తి శంఖుచక్రాల అవతారాలు.

దేవతలచే దేవతలను అర్చించే భాగ్యం, పుణ్యం, విశిష్టతలను కలిగిన నీలి కలువలను మన ముంగిళ్లలోకి, దేవాలయాల్లోకి ఆహ్వానించ డానికి ఆలస్యం ఎందుకు? ఆరుబయట ఎండ లేదా మిద్దె మీద వున్నవారు ఒక వెడల్పాటి చిన్న తొట్టె, మట్టి, నీరు, మొక్క అమర్చుకుంటే చాలు. కనువిందు చేసే కలువలు ప్రతి నిత్యం మీ కళ్ళెదుట పుష్పించి అనుగ్రహిస్తాయి. మీరు రోజూ నీరు పోయవలసిన అవసరం లేదు.

అలాగే కొన్ని రోజులపాటు ఊరు వెళ్ళినా ఇబ్బంది వుండదు. దేవాలయాల్లో కూడా వీలైతే సహజమైన కొలనులను లేదా కృత్రిమ కొలనులను వాస్తు, స్థల అనుకూలతలను బట్టి ఏర్పాటు చేసుకోవడం వల్ల అక్కడి దివ్యచైతన్యం మరింత ఇనుమడించిన వారౌతారు. భక్తులు అన్నదానం, గోదానం, వస్త్ర, జ్ఞాన దానాలతో పాటు వృక్ష, వనదానాలను చేయటం ద్వారా స్వయంగా ఆయా దేవతలకు ఆవాసం కల్పించిన వారౌతారు. అవే అత్యున్నత దేవారామాలుగా అలరారుతాయి. తరతరాలకూ తరగని సౌభా గ్యాలు, సిరి సంపదలు, దీవెనలను ఆ దేవతలు మీకు అనుగ్రహి స్తారు.

మరిన్ని పౌరాణిక విశేషాలను వచ్చే సంచికలో చూద్దాం.